
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 27 డిసెంబరు 2024



వైసీపీకి విషాదమే..

● ఈ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ మట్టి కరిచింది. శ్రీకాకుళం పార్లమెంట్‌తోపాటు ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులే గెలుపొందారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి ఘోర పరాజయం పొందారు. అలాగే విజయనగరం పార్లమెంట్ పరిధిలో ఉన్న ఎచ్చెర్ల నియోజకవర్గంలో కూడా వైసీపీ అభ్యర్థి ఓటమి చెందారు. కూటమి పొత్తులో భాగంగా అక్కడ బీజేపీ అభ్యర్థి బరిలో దిగగా.. బంపర్ మెజార్టీతో విజయం సాధించారు. రాజకీయాల్లో సీనియర్ నేతలైన ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం వంటివారు కనీవినీ ఎరుగని ఓటమిని చవిచూశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దిగజారుడు వ్యాఖ్యలు చేసినవారు ప్రజల ఛీత్కారంతో పరాభవం చెందారు. మహామహులు అని ఎన్నికల ముందు వరకు చెప్పుకున్నవారే... కొత్తవారి చేతిలో పరాజయం పాలయ్యారు. మొత్తానికి ఈ ఏడాది వైసీపీకి విషాదమే మిగిలింది.

మట్టికరిచిన మహామహులు



● జిల్లాలో తారుమారైన రాజకీయ పరిణామాలు ● సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ సీనియర్లకు దెబ్బ
● కూటమిలో కొత్త అభ్యర్థులకు ప్రజాదరణ ● వైసీపీలో నైరాశ్యం.. కూటమిలో జోష్
● సంక్షేమ దిశగా పాలనపై ప్రజల్లో హర్షం

2024 రౌండప్



2024.. మరో నాలుగు రోజుల్లో కాలగమనంలో కలిసిపోనుంది. ఈ ఏడాది జిల్లావాసులకు ఎన్నో తీపి జ్ఞాపకాలు... చేదు సంఘటనలు... మధుర ఘట్టాలను మిగిల్చింది. ప్రధానంగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ప్రత్యేకతను సంతరించుకుంది. వైసీపీ ఐదేళ్ల విధ్వంస పాలనకు ఈ ఏడాది మేలో జరిగిన ఎన్నికల్లో జిల్లావాసులు చరమగీతం పాడారు. కూటమి ప్రభుత్వాన్ని భారీ మెజార్టీతో గెలిపించారు. వైసీపీకి ఒక్కసీటు కూడా దక్కకపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం అలుముకుంది. అంతటా విజయదుందుభి మోగించిన కూటమి శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది. సంక్షేమ దిశగా పాలన సాగిస్తుండడంతో ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

శ్రీకాకుళం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల సంవత్సరంగా 2024.. సిక్కోలు రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసింది. 'బండ్లు ఓడలవుతాయి. ఓడలు బండ్లు అవుతాయి' అన్న చందంగా.. రాజకీయ పరిణామాలు తారుమారయ్యాయి. 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానం మాత్రమే టీడీపీ గెలుచుకుంది. మిగిలిన స్థానాలన్నీ వైసీపీ దక్కించుకుంది. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వైసీపీ అధికార దర్పంతో అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంది. టీడీపీకి మనుగడ లేకుండా చేయాలని వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేశారు. కానీ.. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో సీన్ మారింది. టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలో నిలిచాయి. ఈ ఏడాది మే నెల వరకూ ప్రతాపం చూపిన వైసీపీని నామరూపాలు లేకుండా చేసి.. కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. జిల్లాలో ఒక్క స్థానం కూడా వైసీపీకి దక్కకపోవడంతో ఆ పార్టీలో నిరుత్సాహం అలుముకుంది. ఈ ఎన్నికల్లో మహామహులను కాదని ప్రజలు కొత్తగా రాజకీయ అరంగేట్రం చేసిన వారిని కూడా ఆదరించడం కూటమి ప్రభుత్వంలో జోష్ పెరిగింది.

● కొత్త అభ్యర్థులు.. గెలుపుతో హుషారు...

ప్రతి ఐదేళ్లకు ఎన్నికలు సాధారణమే. అయితే వైసీపీ రాజకీయ అధికార దర్పాన్ని తట్టుకుని.. ఇటు కొత్తగా రాజకీయాల్లోకి వచ్చి విజయం సాధించడమంటే చిన్నవిషయం కాదు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల్లో ఈ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నుంచి కొత్తగా అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. శ్రీకాకుళం నుంచి గొండు శంకర్, ఎచ్చెర్ల నుంచి బీజేపీ తరఫున నడుకుదిటి ఈశ్వరరావు, పాతపట్నం నుంచి మామిడి గోవిందరావు భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ ముగ్గురూ కొత్త అభ్యర్థులే. సీనియర్లను కాదని.. యువతకు ప్రాధాన్యమివ్వాలన్న ఆలోచనతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తీసుకున్న ప్రయోగం విజయవంతమైంది. కొత్త అభ్యర్థుల చేతిలో వైసీపీకి చెందిన మహామహులు ఓటమి పాలయ్యారు. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ చేతిలో మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు 55వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఎచ్చెర్ల సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, పాతపట్టణం సిట్టింగ్ ఎమ్మెల్యే రెడ్డి శాంతిపై కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. అలాగే ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం ప్రాంతానికి చెందిన కలిశెట్టి అప్పలనాయుడు విజయనగరం పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ తరఫున బరిలోకి దిగి గెలుపొందారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వైసీపీకి ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ సీటు కూడా లభించలేదు. మొత్తం కూటమిదే హవా.

● జిల్లా ప్రజలకు లాభమే..

వైసీపీ ఓటమి చెందడం.. కూటమి ప్రభుత్వం కొలువు తీరడంతో జిల్లా ప్రజలకు లాభమే కలుగుతోంది. సంక్షేమ దిశగా పాలన సాగుతోంది. జిల్లావ్యాప్తంగా సామాజిక పింఛన్‌దారులకు రూ.వెయ్యి పెంచుతూ ఏప్రిల్ నుంచి వర్తింపజేస్తూ ఆ నగదును కూటమి ప్రభుత్వం అందజేసింది. దివ్యాంగులకు కూడా భారీగా పింఛన్ పెంచింది. అలాగే గత ఐదేళ్లు మూతపడిన అన్న క్యాంటీన్‌లు.. శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, ఆమదాలవలస, పలాసలో మళ్లీ తెరుచుకున్నాయి. రోజూ వేలాదిమంది పేదలు రూ.5 చొప్పున చెల్లించి ఈ క్యాంటీన్లలో భోజనం చేస్తున్నారు. ఇక నిరుద్యోగులకు జాబ్‌క్యాలెండర్ అంటూ వైసీపీ మోసం చేసింది. కానీ కూటమి ప్రభుత్వంలో మెగా డీఎస్సీ అంటూ కొలువులు ప్రకటించి నోటిఫికేషన్ ఇవ్వడంతో యువత, అభ్యర్థులు పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్నారు. దీపం పథకం కింద ఉచిత సిలిండర్లను మొదటి విడతగా లబ్ధిదారులు అందుకున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా పల్లెప్రాంతాలు.. పట్టణ ప్రాంతాల్లో గత ఐదేళ్ల రోడ్లు అధ్వానంగా ఉండేవి. ఇప్పుడు రోడ్లకు మరమ్మతులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. దాదాపు యాభైశాతం పనులు పూర్తయ్యాయి. గ్రామాల్లో సైతం రోడ్లు బాగుపడడంతో కూటమి పాలనపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పారదర్శకంగా దేహదారుఢ్య పరీక్షలు

● దళారులను నమ్మి మోసపోవద్దు: ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సివిల్ ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించి ప్రిలిమినరీలో ఎంపికైన అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు పారదర్శకంగా నిర్వహించనున్నామని ఎస్పీ కేవీ మహేశ్వరెడ్డి తెలిపారు. గురువారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి విధి విధానాలు, బందోబస్తుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. 'ఎచ్చెర్లలోని ఏఆర్ పరేడ్ మైదానంలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 18 వరకూ కానిస్టేబుళ్ల ఎంపికకు సంబంధించి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నాం. జిల్లావ్యాప్తంగా ఈ పరీక్షలకు 6215 మంది పురుషులు, 1175 మంది మహిళలు మొత్తం 7,390 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఫిజికల్ మెజర్‌మెంట్(పిఎంటి), ఫిజికల్ ఎఫిషియన్సీ(పీఈటీ)పరీక్షలు నిర్వహిస్తాం. మైదానంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిష్పక్షపాతంగా పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నాం. అభ్యర్థులు నిర్ణీత సమయానికి హాజరు కావాలి. ఒరిజినల్ సర్టిఫికెట్లు, గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించిన జిరాక్స్ పత్రాలు ఒక సెట్ తీసుకురావాలి. కాల్ లెటర్‌లో తెలిపిన స్కోర్ కార్డ్(ఒరిజినల్ రిజల్ట్), స్టేజ్-1, స్టేజ్-2 అప్లికేషన్లు తప్పనిసరిగా ఉండాలి' అని తెలిపారు. ఉద్యోగాలు కల్పిస్తామనే దళారులు, మధ్యవర్తులను నమ్మొద్దని సూచించారు. అటువంటివారు ఎదురైతే.. 6300 9990 800, 630 9990 911 ఫోన్ నెంబర్లకు తెలియజేయాలని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ రమణ, డీఎస్పీలు ఎం.అప్పారావు, డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, ఏవో సీహెచ్ గోపినాథ్, సీఐ ఎం.అవతారం, ఆర్ఐ నర్సింగరావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, హాజరైన పోలీసు అధికారులు

డిజిటల్ అరెస్టుపై జాగ్రత్త

● విదేశాల్లో చదువుకుంటున్న, ఉద్యోగం చేస్తున్న వారి తల్లిదండ్రులే టార్గెట్
● డ్రగ్ పార్శిల్ వచ్చిందంటూ బెదిరింపులు
● పోలీసు అధికారులమంటూ ఫేక్ అరెస్టు ఆర్డర్ కాపీలు
● హడలిపోతున్న ప్రజలు



● ఈ ఏడాది ఆగస్టులో జిల్లాలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బెన్‌హర్‌కు డిజిటల్ అరెస్టుకి సంబంధించిన ఫేక్ కోర్టు ఆర్డర్ కాపీ పంపించి బురిడీ కొట్టించేందుకు సైబర్ నేరగాళ్లు ప్రయత్నించారు. ఈ ఫేక్ ఆర్డర్ కాపీకి జతగా డైరెక్టర్ ఆఫ్ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ పోలీసు సంతకాలతో ఓ లెటర్ పంపించారు. చిన్నపిల్లల నీలిచిత్రాలు తీశారంటూ బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. దీనిపై ఆ యన సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేశారు. ఇదే తరహాలో జిల్లాలో మరి కొన్ని ఘటనలు జరగ్గా.. పరువు పోతుందనే ఉద్దేశంతో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు ముందుకు రాలేదు. కాగా.. డిజిటల్ అరెస్టుపై జాగ్రత్తగా ఉండాలని, బాధితులు వెంటనే సంప్రదిస్తే ఇటువంటి మోసాలను అరికట్టవచ్చని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి):

సైబర్ మోసగాళ్లు డిజిటల్ అరెస్టు పేరిట దోచుకుంటున్నారు. విదేశాల్లో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులు, ఉద్యోగులు, వ్యాపారులు, కోటీశ్వరులే లక్ష్యంగా మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరాల్లో ప్రస్తుతం డిజిటల్ అరెస్టు మోసాలు అధికమవడంతో జిల్లావాసులు భయాందోళన చెందుతున్నారు. ఈ మోసాలకు బలైన వారు చాలా మంది పరువుపోతుందని భయపడి పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. దీంతో సైబర్ నేరగాళ్లు యథేచ్ఛగా మోసాలు కొనసాగిస్తున్నారు. సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. పలు బహిరంగ సభల్లో డిజిటల్ అరెస్ట్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారంటే.. ఈ మోసాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు హనీ ట్రాపింగ్ పేరుతో మహిళలు వీడియో కాల్స్ చేస్తూ.. నగ్నంగా కనిపించి.. ప్రజలను కూడా అదే తరహా ఉచ్చులోకి లాగి వీడియోను రికార్డు చేసి డబ్బులు డిమాండ్ చేసేవారు. ఇటీవల విశాఖపట్నంలో ఇటువంటి ఘటన వెలుగుచూసింది. అదే తరహాలో ప్రజల పరువుకు భంగం కలిగించేలా సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టుకు పాల్పడుతున్నారు. తాము పోలీసు అధికారులమని కొందరు, న్యాయమూర్తినని మరికొందరు, కొరియర్ బాయ్స్‌గా ఇంకొందరు.. ఇటువంటి మోసాలకు పాల్పడి పెద్ద మొత్తంలో నగదు దోచుకుంటున్నారు.

● పోలీసులమంటూ నమ్మిస్తారు..

విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, ఉద్యోగాలు చేస్తున్న వారి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తున్నారు. వారి ఫోన్ నెంబర్ల సేకరిస్తున్నారు. ప్రధానంగా విదేశాల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు సేకరించి.. వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి.. బ్లాక్‌మెయిల్ చేస్తుంటారు. తాము సీబీఐ, నార్కోటిక్స్, ఇంటెలిజెన్స్ పోలీసు (మిగతా 6వ పేజీలో..)

ఫిర్యాదు చేయండి..

డిజిటల్ అరెస్ట్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నేరగాళ్లు ఫోన్ చేసి మీ పిల్లలపై కేసుందని డిజిటల్ అరెస్ట్ చేస్తామనేటప్పుడు సమీపంలో పోలీసులను సంప్రదించండి. ఆన్‌లైన్‌లో పోలీసులు అరెస్ట్ చేయడం జరగదు. నిజంగా కేసులుంటే ముందుగా నోటీసులు జారీ చేస్తాం. ఫిజికల్‌గా అందుబాటులో లేకపోతే పోలీసులు నివేదిక తీసుకుని కోర్టు అనుమతులు వచ్చాక న్యాయస్థానం సమక్షంలోనే విచారిస్తాం. నిజానికి పోలీసులు ఎవరూ వీడియోకాల్ చేసి కేసుల నుంచి తప్పిస్తామని చెప్పి డబ్బులు అడగరు. అలా అడిగితే ప్రజలు ధైర్యంగా వారి వివరాలు ఆరా తీయండి. వారు ఆన్‌లైన్‌లో ఉంటుండగానే డబ్బులు జమ చేయొద్దు. ఒకవేళ నగదు బదిలీ చేస్తే.. 24 గంటల్లోపు సమీప పోలీసులకు కానీ, సైబర్ సెల్ నెంబర్ 1930కి సమాచారం ఇవ్వండి. మీరు పంపించిన ఖాతాను సీజ్ చేయించండి. సైబర్ నేరగాళ్లు నిరుపేదలను టార్గెట్ చేసి వారి పేరు మీద డమ్మీ ఖాతాలు తెరిచి లావాదేవీలు చేస్తున్నారు. బ్యాంక్ అధికారులకు దీనిపై అవగాహన కల్పించాం. బ్యాంక్‌కు వచ్చి పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు చేసిన వారి వివరాలను పోలీసులకు అందించాలని సూచించాం. ముందు తల్లిదండ్రులకు.. పిల్లలపై నమ్మకం ఉండాలి. ఇటువంటి మోసాలపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలి.

-ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

జగతిమెట్ట ఇళ్ల కాలనీలో
అక్రమాలు వాస్తవమే

● అనర్హులపై చర్యలు తీసుకుంటాం: ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జగతిమెట్ట సమీపంలో ఇళ్ల కాలనీపై వచ్చిన ఫిర్యాదుల మేరకు స్థానికేతర రెవెన్యూ సిబ్బందితో పది రోజులపాటు ప్రాథమిక దర్యాప్తు నిర్వహించామని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దార్ దిలీప్ చక్రవర్తితో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. 'జగతిమెట్ట ప్రాంతంలో 331 ఇళ్లకు రెవెన్యూ అధికారులు గతంలో పట్టాలు మంజూరు చేస్తే, అక్కడ ప్రస్తుతం 412 ఇళ్లస్థలాలు కనిపిస్తున్నాయి. ఇక్కడ సుమారు 30మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో వారి పట్టాలు రద్దయ్యాయి. మిగిలిన ఇళ్లకు సంబంధించి దర్యాప్తు చేయగా.. 57మంది వరకూ పట్టాలు చూపించి.. స్థానికంగా ఉన్నారు. మిగిలిన వారెవ్వరూ రెవెన్యూ సిబ్బందికి పట్టాలు చూపించలేదు. ఆ ప్రాంతంలో 280 చోట్ల కొందరు పునాదులు, లింటల్స్, శ్లాబ్ లెవెల్స్ నిర్మాణాలు చేపట్టారు. కొంతమంది ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అనర్హులు, పట్టాలు మార్పిడి చేసినవారు, నకిలీ పట్టాలు సృష్టించిన వారిని గుర్తించి.. చట్టపరంగా చర్యలు తీసుకుంటామ'ని ఆర్డీవో తెలిపారు. వారం రోజుల్లో లబ్ధిదారులు తమ పట్టాలను తహసీల్దార్ సమక్షంలో ధ్రువీకరించుకోవాలని సూచించారు. మరోసారి పరిశీలించి.. అనర్హులను తొలగిస్తామని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి


3న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

గుజరాతీపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవరి 3న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో తిరుమల చైతన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ నెల 30న మండలస్థాయి పోటీలు నిర్వహిస్తాం. ఈ పోటీల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితం, ఎర్త్/స్పేస్ సైన్స్, పర్యావరణం, ఇంజినీరింగ్, బయోసైన్స్/ బయోకెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అనే ఉప అంశాలపై ప్రాజెక్టులు తయారు చేయాలి. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు జిల్లాస్థాయి పోటీలకు హాజరుకావాలి. శాస్త్రీయ దృక్పథం, సామాజిక ప్రయోజనం ఉన్న ప్రాజెక్టులను తయారు చేయాలి. థర్మోకోల్‌తో తయారు చేసిన ప్రాజెక్టులను అనుమతించం. అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాల నుంచి ఒక్కొక్క ప్రాజెక్టుతో పాల్గొనాలి. ఈ ఎగ్జిబిషన్‌కు నోడల్ అధికారిగా ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి వ్యవహరిస్తారు' అని డీఈవో వెల్లడించారు.

జిల్లా ప్రగతికి బ్యాంకర్లు సహకరించాలి

● రుణాల లక్ష్యాలు అధిగమించేలా చర్యలు: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం ఎంతో అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాస్థాయి సమీక్ష మండలి సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. వివిధ స్వయం ఉపాధి పథకాల అమలు, రుణాల మంజూరు, గత త్రైమాసికంలో సాధించిన ప్రగతిపై బ్యాంకులు, ప్రభుత్వ శాఖల వారీగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులకు రుణాలు మంజూరు చేసేలా బ్యాంకులు ప్రణాళికలు రూపొందించాలి. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ లావాదేవీలు మరింత బలోపేతం చేయాలి. బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వ పథకాలతోపాటు పంట రుణాలు, విద్యా రుణాలు లక్ష్యం మేరకు పూర్తి చేయాలి. ముఖ్యంగా జిల్లా జీడీపీ అభివృద్ధికి పారిశ్రామిక రంగ అభివృద్ధే కారణం. ఇందుకు బ్యాంకర్లు పూర్తి సహకారం అందించాలి. రానున్న మూడు నెలల్లో కచ్చితమైన ప్రగతిని చూపించాల'ని ఆదేశించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ 'కౌలు రైతులు నష్టపోకుండా వీలైనంత వేగంగా గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలి. అర్హులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు జారీ చేయాలి. పీఎం సూర్యఘర్ పథకానికి సంబంధించి ఎటువంటి ఆలస్యానికి తావు లేకుండా రుణాలు మంజూరు చేయాల'ని ఆదేశించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్ మాట్లాడుతూ.. 'జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రెండవ త్రైమాసికం, ఆగస్టు 30నాటికి క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ. 12586.45కోట్లకుగాను రూ.9681.68 కోట్ల రుణాలు మంజూరు చేశాం. వ్యవసాయ రంగానికి సంబంధించి రూ.7744కోట్ల లక్ష్యానికిగాను, రూ.5878కోట్ల రుణాలు అందజేసి 75.9శాతం ఆర్థిక ప్రగతిని సాధించామ'ని తెలిపారు. పీఎం విశ్వకర్మ, పీఎం సూర్యఘర్, లక్‌పతి, దీదీ ఎడ్యుకేషన్ లోన్స్ మంజూరు తదితర అంశాలపై చేపడుతున్న పనులను వివరించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎంవీ తిలక్, ఆర్బీఐ ఏపీ రీజియన్ ఎల్డీవో గిరిధర్ బెహరా, డీసీసీబీ సీఈవో డి.వరప్రసాద్, నాబార్డు డీడీఎం కె.రమేష్‌కృష్ణ, ఉద్యాన, వ్యవ సాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖ, డీసీసీబీ, వివిధ బ్యాంకులకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.



జేఆర్ పురం పోలీసుల అదుపులో నిందితులు

గంజాయితో 11మంది అరెస్టు

7లో

ప్రభుత్వ ఆశయానికి తూట్లు!

● 'పల్లెపండుగ' పనుల్లో పర్యవేక్షణ కరువు
● ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

7లో


కొత్త పట్టణాలేవీ?

● జిల్లాలో తగ్గిన మునిసిపాలిటీల సంఖ్య
● కొత్తవి ప్రకటిస్తే అభివృద్ధికి ఊతం
● ప్రజాప్రతినిధులపై బాధ్యత


6లో



పక్షి రెక్క.. చిత్ర మాలిక!


గురజాడ


అయోధ్య రాముడు


సింహాద్రి అప్పన్న


ఇళయరాజా



● ఓ కళాకారుడి వినూత్న ప్రయత్నం

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి)

కుంచెతో కాన్వాసు పైనో... గోడల పైనో... కాగితాల పైనో బొమ్మలు గీయడం చాలామంది చిత్రకారులు చేసే పనే. దీనికి భిన్నంగా ఏమైనా చేస్తేనే మనకంటూ ప్రత్యేకత ఉంటుంది.. ఇదే మాట తన మనసులో అనుకున్నాడా చిత్రకారుడు. కొత్తగా ఏం చేయాలా అని ఆలోచించాడు. పక్షి రెక్కలు..ఈకలపై చిత్రాలు గీసి తన ముద్ర చూపించాడు. ఆయనే శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని చిత్తరంజన్ వీధిలో ఉన్న వాడాడ రాహుల్. నెమలీక, పావురం రెక్క... ఇలా ప్రతి దాన్నీ తన కళా ప్రతిభ చూపించేందుకు వినియోగించుకుంటున్నాడు. గురజాడ, గిడుగు రామ్మూర్తి పంతులు, గాంధీ, నెహ్రూ తదితర దేశ నాయకులే కాదు... శ్రీ వేంకటేశ్వర కల్యాణం... శ్రీరామ పట్టాభిషేకం... శ్రీ కృష్ణ లీలలు వంటి పురాణ ఘట్టాలను కూడా వాటిపై చిత్రీకరించాడు. సింహాద్రి అప్పన్న... శివుడు.. స్వామి వివేకానంద తదితర చిత్రాలకూ పక్షి వెంట్రుకలే



కాన్వాసుగా చేసుకున్నాడు. గురజాడ రచనలంటే తనకు ఎంతో ఇష్టమని చెబుతారు రాహుల్. ఆ దార్శనికునిపై ఉన్న మమకారంతోనే గురజాడ చిత్రాన్ని అత్యంత శ్రద్ధాసక్తులతో చిత్రీకరించానన్నారు. అంతేకాదు.. వివిధ ప్రాంతాల్లోని పాఠశాలల గోడలపై ఎన్నో విద్యా సంబంధిత చిత్రాలను గీసి ప్రశంసలు పొందారు. కొంతమంది రచయితల పుస్తకాలకు ముఖచిత్రాలను గీస్తున్నారు. బియ్యపు గింజలపై కూడా చిత్రాలను గీయడంలో తన ప్రతిభను చాటుకుంటున్నారు. తన కళతో వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థల నుంచి పురస్కారాలనూ అందుకున్నాడీ కళాకారుడు. అమెరికా బుక్ ఆఫ్ వరల్డ్, రావా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఆస్కార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, హైరేంజ్ వరల్డ్ రికార్డ్స్, గ్రేట్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నాడు రాహుల్. అన్నిటి కంటే ముఖ్యంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో తన పేరు నమోదు కావడం మరచిపోలేని అనుభూతిగా చెబుతున్నాడు.



కొత్త పట్టణాలేవీ?

● జిల్లాలో తగ్గిపోయిన మున్సిపాలిటీల సంఖ్య
● కొత్తవి ప్రకటిస్తే అభివృద్ధికి ఊతం
● ప్రజాప్రతినిధులపై బాధ్యత


టెక్కలి పట్టణం

పలాస/సోంపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన తరువాత శ్రీకాకుళం జిల్లాలో ఉన్న పట్టణాల సంఖ్య తగ్గిపోయింది. జిల్లాలో గతంలో శ్రీకాకుళం కార్పొరేషన్, పాలకొండ, రాజాం నగర పంచాయతీలు, ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పురపాలక సంఘాలు ఉండేవి. విభజన తరువాత పాలకొండ, రాజాం నగర పంచాయతీలు పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోకి వెళ్లిపోయాయి. శ్రీకాకుళం కార్పొరేషన్, ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మున్సిపాలిటీలు మిగిలిపోయాయి. వాస్తవానికి జిల్లాలో అతిపెద్ద పంచాయతీలుగా ఉన్న నరసన్నపేట, టెక్కలి, సోంపేట, పాతపట్నంలను నగర పంచాయతీలు, గ్రేడ్-3 మున్సిపాలిటీలుగా చేయడానికి గతంలో అనేక ప్రభుత్వాలు ప్రయత్నించి ప్రతిపాదనల వరకు తీసుకువచ్చాయి. జనాభా తక్కువ ఉండడం... సాంకేతిక సమస్యలు, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా గ్రేడ్-1 పంచాయతీలుగానే మిగిలిపోయాయి.

అభివృద్ధికి అవకాశం..

ప్రస్తుతం జిల్లాలు, డివిజన్ల పునర్వ్యవస్థీకరణ చేసిన విధంగానే మున్సిపాలిటీల సంఖ్య పెంచితే పాలనపరంగా అభివృద్ధి చెందడంతో పాటు పంచాయతీలను పట్టణాలుగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉంటుంది. పాలకొండ, రాజాంల కంటే టెక్కలి, సోంపేట, నరసన్నపేట పంచాయతీలు భౌగోళికంగా, జనాభాపరంగా కూడా పెద్దవి. దీంతో పాటు జిల్లాలోని నగరాలతో ఈ పంచాయతీలు అభివృద్ధిలో పోటీ పడుతున్నాయి. వ్యాపారపరంగా కూడా నరసన్నపేట, టెక్కలి జిల్లాలో మొదటి స్థానంలో ఉంటాయనడంలో అతిశయోక్తి లేదు. ఈ పరిస్థితుల్లో పంచాయతీలను పురపాలక సంఘాలుగా తీర్చిదిద్దితే ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో పాటు జిల్లాలో మున్సిపాలిటీల సంఖ్య పెరుగుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. టెక్కలిని నగర పంచాయతీగా మార్పు చేయాలని గతంలో అనేక పర్యాయాలు ప్రభుత్వం ప్రయత్నించింది. భౌగోళిక స్థితిని గుర్తించింది. ఆ ప్రాంతంలోని కొందరు నేతలు దీనికి విముఖత చూపించడం, జనాభా తక్కువగా ఉండడంతో ఆ ప్రతిపాదన వెనక్కు వెళ్లిపోయింది.

ఈ పంచాయతీలు అనుకూలం..

టెక్కలికి వాణిజ్యపరంగా జిల్లాలో గుర్తింపు ఉంది. ప్రపంచ ప్రఖ్యాత నీలి రంగు గ్రానైట్ ఈ ప్రాంతంలోనిదే. ప్రస్తుతం డివిజన్ కేంద్రంగా, మేజర్ పంచాయతీ, రాష్ట్ర రాజకీయాలకు కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. నరసన్నపేటకు కూడా అదే విధమైన గుర్తింపు ఉంది. వస్త్ర వ్యాపారం, బంగారు వ్యాపారానికి ఈ ప్రాంతం ఎంతో ప్రసిద్ధి చెందినది. జిల్లాలో ఏ ప్రాంతంలో శుభకార్యాలైనా నరసన్నపేటకే కొనుగోలుకు వెళ్తున్న పరిస్థితి ఉంది. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఈ పంచాయతీ అన్ని రంగాల్లో ఇప్పటికే అభివృద్ధి చెందింది. మున్సిపాలిటీగా చేయడానికి అన్ని రకాలుగా అర్హత ఉంది. పురపాలక సంఘంగా మారాలంటే స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉంది. కొత్తగా ఏర్పడిన పలాస డివిజన్‌లో అతిపెద్ద పంచాయతీగా సోంపేట పేరు ప్రఖ్యాతులు గాంచింది. మున్సిపాలిటీగా మార్చడానికి అన్నివిధాలా అనువైన పంచాయతీ ఇది. ఉద్దానంలో ఇదే అతిపెద్ద వాణిజ్య కేంద్రం. ఈ మూడు పంచాయతీలు నగర పంచాయతీలుగా మార్పు చేయడానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటే జిల్లా మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. దీనిపై నేతలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


నరసన్నపేట పట్టణం



ఆకాశానికి పసుపు తోరణం

దాదాపు పది రోజులుగా వర్షాలు... ముసురు... మబ్బులతో... ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాలనుకున్నాడేమో సూరీడు. గురువారం ఉషోదయ వేళలో ఆకాశాన్ని వివిధ వర్ణాలతో నింపేశాడు. తన కిరణాల సోయగంతో విభిన్న రంగుల్లోకి మేఘాలను మార్చి.. చూపరులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తాడు. ఇచ్ఛాపురం సురంగి రాజా మైదానంలో వాకింగ్‌కు వెళ్లిన వివిధ వర్గాల వారు ఈ దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధించి.. మురిసిపోయారు.

-ఇచ్ఛాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి)

డిజిటల్ అరెస్టుపై జాగ్రత్త

(ఐదో పేజీ తరువాయి)

అధికారులమని బాధితులను నమ్మిస్తారు. ఆ అధికారుల సామాజిక మాధ్యమాల ఖాతాల్లో పోలీసుల ఫేక్ ఫొటోలు పెడతారు. విదేశాల్లో ఉన్న మీ పిల్లలను డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని చెప్పి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. 'మీ అబ్బాయికి వచ్చిన పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయి. మరికొద్ది క్షణాల్లో కస్టమ్స్ అధికారులు వచ్చి అరెస్టు చేస్తారు. ఈ అపాయం నుంచి మీ అబ్బాయి బయటపడాలంటే కొంత సొమ్ము చెల్లించాలి' అని డిమాండ్ చేస్తారు. డిజిటల్ అరెస్టుకు సంబంధించిన ఫేక్ ఆర్డర్ కాపీలను సామాజిక మాధ్యమాల్లో పంపిస్తారు. విషయం బయటకు తెలిస్తే అరెస్టు తప్పదని, ఇదంతా క్షణాల్లో జరిగే ప్రక్రియని.. అరెస్ట్ చేశాక చేసేదేమి లేదని భయపెడతారు. డిజిటల్ అరెస్ట్ చేయడంతోనే వారి వీసాలు రద్దవుతాయని, జైలుకు పంపిస్తామని చెప్పి భయపెడుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. వీడియో కాల్‌లో అవతలి వ్యక్తి పోలీసు యూనిఫాంలో కనిపించడంతో అవన్నీ నిజమేనని చాలామంది నమ్మేస్తున్నారు. అరెస్టు అయితే.. సమాజంలో తమ పరువు పోతుందని, పిల్లల భవిష్యత్ నాశనం అవుతుందని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు భయాందోళన చెందుతున్నారు. ఏదోలా తమ బిడ్డ బయటపడాలనే ఉద్దేశంతో సైబర్ నేరగాళ్లు అడిగినంత సొమ్ము ఆన్‌లైన్‌లోనే వారు చెప్పిన ఖాతాకు జమ చేస్తున్నారు. తర్వాత అసలు విషయం కనుక్కుని.. తాము మోసపోయామని గ్రహించి లబోదిబో మంటున్నారు. కాగా.. రూ.లక్షల్లో పోగొట్టుకుంటున్న ప్రజలు ఈ మోసాలపై ఫిర్యాదుకు వెనుకంజ వేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే తమ పరువు పోతుందనే భయంతో.. విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు.



హమ్మయ్య.. ఎండ వచ్చింది

సోంపేట: ధాన్యాన్ని ఆరబెట్టిన దృశ్యం

● వరి పంటను రక్షించుకునే ప్రయత్నంలో రైతన్నలు
● ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న వైనం ● ఇంటికి చేర్చే పనిలో బిజీ


ఇచ్ఛాపురం: ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు..

ఇచ్ఛాపురం/సోంపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సుమారు పది రోజులుగా కురుస్తున్న వర్షాల నుంచి గురువారం ఉదయానికి కాస్త ఉపశమనం లభించింది. అన్నదాత ఊపిరి తీసుకునేందుకు అవకాశం కలిగింది. రోజుల తరబడి నీటిలో ఉన్న ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ప్రకృతి సహకరించింది. దీంతో వరుణుడి నుంచి పంటను కాపాడుకోవడానికి ఇన్నాళ్లు అవస్థలు పడిన అన్నదాతలు గురువారం ధాన్యాన్ని ఇళ్లకు చేర్చడం..ఎండలో ఆరబెట్టడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు.


తొలి నుంచీ అంతే...


ఇచ్ఛాపురం: నేలకొరిగిన పనలను కోస్తున్న రైతు

ఖరీఫ్‌లో ఎన్నో ఆశలతో వరి సాగు చేసిన రైతన్నకు మొదటి రోజు నుంచి చివరి వరకు కష్టాలు వీడలేదు. అష్టకష్టాలు పడి సాగుచేస్తే.. చేతికందే దశలో ప్రకృతి కన్నెర్రజేసింది. అల్పపీడనాల రూపంలో దాడి చేసింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో అనేక ప్రాంతాల్లో పంట తడిసిపోయింది. ధాన్యం మొలకలు వచ్చాయి. పొలంలో కోసి ఉంచిన వరి పనలు తడుస్తుండటంతో ధాన్యం రంగు మారుతోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దీని వల్ల సరైన ధర రాదని తల్లడిల్లుతున్నారు. ఈదురు గాలులకు ఇంకా కోత కోయకుండా ఉన్న వరి చేలు నేలకొరిగాయని రైతులు వాపోతున్నారు. ఎట్టకేలకు గురువారం నాటికి వర్షం తెరిపిచ్చింది. దీంతో బిర్లంగి, తోటూరు, హరిపురం, తేలుకుంచి, కొళిగాం, పాయితారి పంచాయతీలలో రైతులు పొలాల్లో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో పడ్డారు. ఉదయం నుంచి ఎండ ఉండటంతో రైతులు ధాన్యాన్ని ఆరబెటడం... నేలకొరిగిన వరి చేలును సరిచేసుకునే పనుల్లో పడ్డారు. కొన్నిచోట్ల నూర్పులకు దిగారు. నూర్చిన ధాన్యాన్ని కొన్నిచోట్ల పొలాల్లో.. మరికొన్ని చోట్ల రహదారులపై ఎండబెట్టారు. కొన్ని గ్రామాల్లో భద్రపరుచుకున్నారు.

తీవ్ర నష్టం...

లావేరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో సుమారు పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంట తడిసిపోవడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ఆరుగాలం శ్రమించి అప్పులు చేసి పండించిన పంట చేతికి వచ్చేసరికి తమ కళ్ల ముందే నీటి పాలవడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. లింగాలవలస, కొత్తకోట, బుడుమూరు, గుర్రాలపాలెం, గురుగుబిల్లి తదితర గ్రామాల్లో నష్టం ఎక్కువగా ఉంది.


లావేరు: లింగాలవలసలో తడిసిన చేలను చూపిస్తున్న రైతు

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీకాకుళం, కాశీబుగ్గ, టెక్కలి సబ్ డివిజన్ అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలపై ఆరా తీసి.. నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్‌స్పాట్ జోన్లను గుర్తించి వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించి... రహదారి భద్రతా నియమాలు పాటించని వారిపై జరిమానాలు విధించాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద వేకువ జామున ఫేస్‌వాష్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రమాద హెచ్చరిక బోర్డులు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హెల్మెట్ ధరించటం, డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికుల రవాణా వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. ఏఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

గుజరాతీపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవ మహాసభలు జనవరి 5,6,7,8 తేదీలో నిర్వహించనున్నారు. కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ సభలు జరుగనున్నాయి. ఈ మేరకు నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


స్వర్ణోత్సవ పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ ఆశయానికి తూట్లు

- 'పల్లెపండగ' పనుల్లో పర్యవేక్షణ కరువు
- ఇష్టారాజ్యంగా నిర్మాణాలు



గ్రామాల్లో ముమ్మరంగా సీసీ రోడ్ల పనులు జరుగుతున్న దృశ్యం



ఇంజనీర్లు లేకుండా సీసీ రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

రణస్థలం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పల్లెల స్వరూపమే మార్చాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకుగాను 'పల్లె పండుగ' పేరుతో భారీగా అభివృద్ధి పనులు చేపడుతోంది. గ్రామంలో రహదారులు, కాలువలను అభివృద్ధి చేస్తోంది. ఇందుకుగాను భారీగా నిధులు ఖర్చుపెడుతోంది. సంక్రాంతి నాటికి గ్రామీణ ప్రజల కళ్లల్లో ఆనందం నింపాలని భావిస్తోంది. అయితే కొందరు అధికారులు, సిబ్బంది పుణ్యమా అని పనుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రణస్థలం మండలంలో 34 పంచాయతీల పరిధిలో 111కు పైగా గ్రామాలు ఉన్నాయి. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా 94 పనులు మంజూరయ్యాయి. ఇందుకుగాను రూ.9.26 కోట్లు నిధులు విడుదల చేశారు. ప్రస్తుతం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జరిగిన పనులకుగాను ప్రతి గురువారం బిల్లుల చెల్లింపులు కూడా చేపడుతున్నారు. 44 సీసీ రోడ్ల పనులు పూర్తిగా 54 సీసీ రోడ్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. సీసీ రోడ్లు వేసినప్పుడు 10 అడుగులు వెడల్పు అయితే ఐదు అంగులాలు ఎం-20 క్వాలిటీ, 12 అడుగులు సీసీ రోడ్డు అయితే ఏడు అంగులాల ఎం-30 నాణ్యత కలిగి ఉండాలి. కానీ పనుల వద్ద ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది లేకపోవడంతో ఇష్టారాజ్యంగా జరుగుతున్నట్టు విమర్శలున్నాయి. 12 అడుగుల వెడల్పుతో రోడ్డు వేయాల్సిన చోట.. 10 అడుగులు వేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల కాలువలు తక్కువ లోతు వేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ పనుల విషయంలో ముగ్గురు ఇంజనీరింగ్ సహాయకులు మేనేజ్ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఏఈ అప్పన్న వద్ద ప్రస్తావించగా.. పనులు జరిగినప్పుడు సిబ్బంది ఉండడం సాధ్యం కాదన్నారు. సిబ్బంది కొరత దృష్ట్యా పనులు ప్రారంభించే సమయంలో ఉంటున్నారని.. ఒకరికి చాలా గ్రామాల బాధ్యత ఉండడంతో సాధ్యం కాదని చెప్పారు.

ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయురాలు ఆత్మహత్య



నీరజ(ఫైల్)

ఎచ్చెర్ల/గార, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న గనగళ్ల నీరజ(22) బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ వి.సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గార మండలం కళింగపట్నం పంచాయతీ నగరాలపేట గ్రామానికి చెందిన నీరజ ఎచ్చెర్లలోని కేశవరెడ్డి స్కూల్‌లో అసోసియేట్ టీచర్‌గా పనిచేస్తోంది. ఈమె అక్క హేమలత కూడా ఇదే పాఠశాలలోనే రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరూ స్కూల్ కాంపౌండ్‌లోని వసతి గృహంలోనే ఉంటున్నారు. బుధవారం క్రిస్మస్ కారణంగా పాఠశాలకు సెలవు కావడంతో నీరజ తన గదిలోనే ఉండగా, హేమలత విధులకు హాజరైంది. వీరిద్దరూ మధ్యాహ్న భోజన సమయంలో కొద్ది సేపు మాట్లాడుకోగా, అక్క తిరిగి విధుల్లోకి వెళ్లింది. నీరజ మాత్రం తాను ఉంటున్న గదికి వెళ్లిపోయింది. ఆ తర్వాత ఏమైందోగాని నీరజ తన గదిలోనే ఉన్న ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హేమలత విధులు ముగించుకుని సాయంత్రం ఆరు గంటల సమయంలో రూమ్‌కి చేరుకుని తలుపులు కొట్టినా ఎంతసేపటికీ నీరజ తలుపులు తీయలేదు. ఫోన్ చేసినా లిఫ్ట్‌చేయలేదు. దీంతో తలుపు గడియ సందులోంచి చూడగా నీరజ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. దీంతో హేమలత కేకలు వేయగా.. క్యాంపస్‌లోని వాళ్లు అక్కడికి చేరకుని నీరజ మెడకు ఉన్న చున్నీని తప్పించారు. అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోవడంతో.. ఆమె స్వగ్రామంలోని తాత, నాన్నమ్మలకు హేమలత సమాచారం ఇచ్చింది. రాత్రికి రాత్రే మృతదేహాన్ని నగరాలపేటకు చేర్చడంతో.. అక్కడి బంధువులు, గ్రామస్థులు అడ్డుకుని, ఏమి జరిగిందో తెలియాలని పట్టుబట్టారు. దీంతో గార పోలీసులకు బుధవారం అర్ధరాత్రి సమాచారం అందించారు. గురువారం వేకువ జామున గార పోలీసులు నగరాలపేట చేరుకుని జరిగిన ఘటన వివరాలు సేకరించి, ఎచ్చెర్ల పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. అయితే నీరజ మృతి పట్ల తల్లిదండ్రులు కొండమ్మ, రాంబాబు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామని ఎస్ఐ సందీప్‌కుమార్ తెలిపారు.

సబ్సిడీ పెట్రోల్‌కు దివ్యాంగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ పెట్రోల్ పొందేందుకు దివ్యాంగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు కె.కవిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో గల దివ్యాంగులు సొంతంగా మూడు చక్రాల వాహనం కలిగి ఉండి, ఏదైనా సొంతంగా వ్యాపారం చేస్తున్నా, గుర్తింపు కలిగిన ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్నవారు పెట్రోల్ సబ్సిడీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు పూర్తి చేసి, సదరం సర్టిఫికెట్, కొనుగోలు చేసిన పెట్రోల్ బిల్లులు, తెల్ల రేషన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, వాహనం రిజిస్ట్రేషన్ పత్రం(దివ్యాంగుని పేరుతో ఉండాలి), బ్యాంకు పాస్ బుక్ మొదటి పేజీ, ఆధార్ కార్డు, వ్యాపారం/ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నట్టు ధ్రువపత్రం, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో (వికలాంగత్వం కనపడే)తో సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, శ్రీకాకుళంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08942-240519 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఆమదాలవలస, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. గురువారం పట్టణ శివారులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యం నుంచి మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, గంజాయిని ఎవరైనా విక్రయించిన సరఫరా చేసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

క్రీడల్లో సత్తాచాటిన డిగ్రీ విద్యార్థులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన నితిన్, శ్రవంతి

సోంపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బారువ డిగ్రీ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటుతున్నారు. అథ్లెటిక్స్ విభాగంలో పి.శ్రవంతి, బి.నితిన్ ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు భువనేశ్వర్ క్యిట్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొన్నారు. సౌత్‌జోన్ ఖోఖో విభాగంలో వి.తాతారావు ఈ నెల 27 నుంచి 30వ వరకు తమిళనాడు రాష్ట్రం తిరువనంతపురంలో జరిగేపోటీల్లో పాల్గొన్నట్టు పీఈటీ కొణతాల రామారావు తెలిపారు. వీరికి ప్రిన్సిపాల్ డి.రామారావు, వైస్ ప్రిన్సిపాల్ పండి రామకృష్ణ, అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

లావేరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బాలిక విద్యను ప్రోత్సహించేందుకు ప్రారంభించిన కేజీబీవీల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి రాష్ట్ర సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) అడిషనల్ డైరెక్టర్ సంపతిరావు శశిభూషణ్‌రావు అన్నారు. గురువారం మురపాక కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థినులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బల్ల సుధ, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయితో 11 మంది అరెస్టు

రణస్థలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దన్నానపేట గ్రామానికి సమీపాన గురువారం రెండు కేజీల గంజాయి బ్యాగులతో కొంతమంది జేఆర్‌పురం పోలీసులకు పట్టుబడ్డారు. ఈ కేసులో మొత్తం 11 మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. వీరిలో ఒక బాలుడు ఉన్నాడు. జేఆర్‌పురం సీఐ అవతారం అందించిన వివరాల మేరకు రెండు ద్విచక్ర వాహనాలతో జి.సాయి, పి.సత్యనారాయణ, కోల హర్షవర్ధన్, పి.దుర్గాప్రసాద్ రెండు బ్యాగులతో గంజాయి తెస్తూ... ఎస్ఐ చిరంజీవికి పట్టుబడ్డారు. జి.సాయి అనే యువకుడు పర్లాకిమిడికి చెందిన రబింద్రో ప్రదాన్ వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నాడు. చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి కె.సంతోష్, బూసర పైడిరాజు, ఉప్పాడ విజయ్ కుమార్, చందక వెంకటేష్, బి.పవన్ కుమార్, ఎం.దిలీప్‌లకు విక్రయిస్తున్నాడు. వీరంతా గంజాయి అలవాటు ఉన్న వారికి ఈ ప్యాకెట్లను అధిక ధరలకు విక్రయిస్తుంటారు. వీరందరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ అవతారం తెలిపారు. ఎం.దిలీప్ పరారీలో ఉన్నాడు. గంజాయి కేసును ఛేదించిన జేఆర్‌పురం ఎస్ఐ చిరంజీవిని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అభినందించినట్లు సీఐ తెలిపారు.

సుపరిపాలన రోజుగా జరుపుకోవడం సంతోషం: ఎన్ఈఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

గుజరాతీపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని వాజపేయి జయంతి రోజును సుపరిపాలన దినోత్సవంగా జరుపుకోవడం సంతోషంగా ఉందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. స్థానిక గురజాడ కళాశాల హాల్‌లో సుపరిపాలన దినత్సోవం పేరిట సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, నాయకులు పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, అట్టాడ రవి బాబ్జీ, శవ్వాన ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్

ఎచ్చెర్ల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆర్జీయూకేటీ (నూజివీడు) రిజిస్ట్రార్ డాక్టర్ సండ్ర అమరేంద్రకుమార్ విద్యార్థులకు సూచించారు. ఎస్ఎంపురం కొండపై ఉన్న శ్రీకాకుళం క్యాంపస్‌ను ఆయన గురువారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతిభ గల విద్యార్థులే ట్రిపుల్ ఐటీలో చేరుతున్నప్పటికీ పీయూసీ పూర్తయ్యేసరికి 30 శాతానికి పైగా ఫెయిల్ అవుతున్నారన్నారు. వీరికి రెండు, మూడు సార్లు రెమిడియల్ తరగతులు, పరీక్షలు నిర్వహించాల్సి వస్తోందన్నారు. అధ్యాపకులు కూడా అకడమిక్ పరంగా మరిన్ని జాగ్రత్తలు తీసుకుని ఉత్తమ ఫలితాలు సాధనకు కృషిచేయాలన్నారు. మెంటార్స్‌కు ప్రత్యేక డిజిగ్నిజేషన్ ఇవ్వనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి పాల్గొన్నారు.

చినుకు పడితే అంతే

లావేరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గురుగుబిల్లి నుంచి బట్టుపాలెం వెళ్లే సుమారు నాలుగు కిలోమీటర్ల రహదారి అధ్వానంగా తయారైంది. గ్రామస్థులకు ఏ కష్టం వచ్చినా కనీసంగా 108 వాహనం కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంపై వారంతా నిట్టూరుస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే గ్రామం దాటి బయటకు రావాలంటే అష్ట కష్టాలు పడాల్సిందే. దీంతో వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ గ్రామస్థుల గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. రోడ్డు బురదగా మారిపోయి ఏ వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. గత వైసీపీ ప్రభుత్వ నాయకులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. కనీసం కూటమి ప్రభుత్వ పెద్దలైనా స్పందించి పక్కా రోడ్డు వేయాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.



బురదమయంగా బట్టుపాలెం రహదారి

బీసీల అభ్యున్నతే ధ్యేయంగా పోరాటం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత శౌంతి నాగరాజు

అరసవల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి: గత పదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల అభివృద్ధికి చేసిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర చైర్మన్ శౌంతి నాగరాజు అన్నారు. స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో బుధవారం జరిగిన పార్టీ జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో బీసీలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, వారి అభ్యున్నతే ధ్యేయంగా పోరాటాలు చేస్తామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో స్పీకర్, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు బీసీల కోసం చేసిన వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కూడా జిల్లాలో ఒక కేంద్రమంత్రి, రాష్ట్రమంత్రి ఉన్నా సరే బీసీల అభ్యున్నతికి ఏం చేశారని ప్రశ్నించారు. జనవరిలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల పలాస వస్తున్నారని, ఇందిరాగాంధీ విగ్రహాన్ని అవిష్కరిస్తారని తెలిపారు. పార్టీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి.కృష్ణారావు, నాయకులు మహేష్, టి.మధుసూదనరావు, కేవీఎల్ఎన్ ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

శ్వేతగిరివాసునికి పూజలు



పుష్పాలంకరణలో స్వామివారు

గార, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి: ప్రసిద్ధ శ్వేతగిరిపై కొలువుదీరిన కాళీయ మర్దన వేణుగోపాల స్వామి వారికి మార్గశిర బహుళ ఏకా దశి సందర్భంగా గురువారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు, విశేష పుష్పాలంకరణ సేవ నిర్వహించారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ సుగ్గు మధురెడ్డి ఎంపీటీసీ సభ్యులు సుగ్గు లక్ష్మి నరసింహాదేవి దంపతులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకున్నారు.

ధాన్యం సంరక్షణకు చర్యలు చేపట్టాలి

- జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసిపోకుండా చూడాలని, అలాగే అవసరమైన రైతులకు టార్పాలిన్లు, టెంట్లు, గోనె సంచులు, ఇతర వసతులను అందుబాటులో ఉంచాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్న సమీక్షలో భాగంగా కలెక్టర్ కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకోవాలి, వచ్చిన ధాన్యం వచ్చినట్టు సేకరించాలి. పంట నష్టాన్ని కచ్చితత్వంతో నమోదు చేయాలన్నారు. 'పల్లె పండుగ' పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలన్నారు. పీఎం సూర్యఘర్ లక్ష్యాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్లు పద్మావతి, డీపీవో కె.భారతి సౌజన్య, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, జడ్పీ సీఈవో శ్రీధర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ పరిశీలన



పరిశీలిస్తున్న జేఈ ఆంజనేయ నాయక్

బూర్జ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్లెన నుంచి పాలకొండ వరకు ఉన్న రహదారిలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టినట్టు ఆర్అండ్‌బీ జేఈ ఆంజనేయ నాయక్ తెలిపారు. జేఈ మాట్లాడుతూ సరుబుజ్జిలి, బూర్జ గ్రామీణ రహదారుల కంపచెట్లను తొలగించేందుకు ప్రభుత్వం రూ.4.5లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కాగా గత ప్రభుత్వం జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో పాలకొండ వరకు రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఎట్టకేలకు క్లియర్ చేయడంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేశారు.

'పరీక్ష పే'పై అవగాహన

ఇచ్ఛాపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ కార్యాలయంలో పరీక్ష పే చర్చా రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం చేపట్టారు. పరీక్ష పే చర్చా రిజిస్ట్రేషన్ ఏ విధంగా చేసుకోవాలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉపాధ్యాయులకు, జూనియర్ కళాశాల లెక్చరర్స్‌కు, ఆరు నుంచి ఇంటర్ చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, డైట్ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

మొబైల్ ఆధార్ సెంటర్లు వినియోగించుకోండి

ఆమదాలవలస, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ సెంటర్ల సేవలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. నియోజకవర్గంలోని చిన్నారుల ఆధార్ నమోదులోని ఇబ్బందులు గుర్తించిన ఎమ్మెల్యే కూన రవికుమార్ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు ఆధార్ నమోదుకు అవకాశం కల్పించిందన్నారు. టి.జొన్నవలస, కొర్లకోట, దూసి, పాలవలస, చీడివలస, పురుషోత్తపురం, షలంత్రి, లోలుగు, తాడివలస, పొందూరు-2, రాపాక-1, కనిమెట్ట సచివాలయాల్లో వీటిని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

సంతోషిమాతకు పూజలు



అలంకరణలో అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సంతోషిమాతకు బహుళ ఏకాదశి సందర్భంగా స్వాతి జన్మ నక్షత్రం పూజలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. శ్రీదేవి ఖడ్గమాలతో కుంకుమ పూజలు చేశారు. లలితా సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు చేపట్టారు.

కేజీబీవీలో వీరబాల దివస్

ఇచ్ఛాపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ పాఠశాలలో వీరబాల దివస్ వేడుకలు బీజేపీ జిల్లా మోర్చా కార్యదర్శి ధనుష్ రంగా ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీర బాలల దివస్ ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో శిరీష, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు వీకే ప్రసాద్, మంగి లక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరాటాలు ఉధృతం చేస్తాం

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమ్మె క్యాంపు ఒప్పందాలను అమలు చేయాలని లేకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గురువారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్(ఆప్కాస్) కార్మికులందరిని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కడం అన్యాయమన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర కమిటీ నాయకులు కల్యాణ రాజు, అరుగుల రాము, ఎ.హోహన్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రమాదకరంగా అరకబద్ర వంతెన

- కానరాని రాతికట్టు నిర్మాణాలు
- కొట్టుకుపోతున్న మట్టి



కొట్టుకుపోయిన మట్టి కట్టలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అరకబద్ర గ్రామం వద్ద కొత్తగా వంతెన నిర్మాణం చేపట్టారు. కాని వంతెనకు ఇరువైపులా రాతికట్ట నిర్మాణం చేపట్టకుండానే వాడకలోకి తీసుకొచ్చారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రిపూట ప్రయాణంలో ఏ గోతులో పడిపోతామోనని భయపడుతున్నారు. పెద్ద ప్రమాదాలు జరగకముందే వంతెనకు ఇరుపక్కల వాల్స్ నిర్మాణం చేపట్టాలని వారంతా కోరుతున్నారు.


మెళియాపుట్టి: పెద్దజగన్నాథపురంలో తడిసిపోయిన వరి కుప్పను పరిశీలిస్తున్న అధికారులు


హిరమండలం: మొక్కజొన్న పొలంలో చేరిన నీరు


హరిపురం: వీజీపురంలో తడిసిపోయిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కుప్పల్లోకి నీరు.. ధాన్యానికి మొలకలు

- రోడ్లపై ఆరబెడుతున్న రైతులు
- అపరాల పంట పొలాల్లో చేరిన నీరు

జిల్లాలో వారంరోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల అన్నదాతకు అపారనష్టం వాటిల్లింది. ప్రధానంగా పొలాల్లో ఆదరాబాదరాగా కోసి పెట్టిన కుప్పల్లోకి నీరు చేరడంతో తడిసిపోయాయి. రోజుల తరబడి పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో అపరాల పంట దెబ్బతినే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల ధాన్యానికి మొలకలు వస్తుండడంతో నష్టపోయామని వాపోతున్నారు. మిగిలి ఉన్న ధాన్యం పాడవకుండా రోడ్లపై ఆరబెడుతున్నారు. ఈనేపథ్యంలో అధికారులు పంటపొలాలు, కళ్లాల్లో ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్నారు.

- మెళియాపుట్టి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం, గంగరాజపురం, పెద్దలక్ష్మీపురం, పట్టుపురం, చాపర, వసుంధర, కొసమాళల్లో ధాన్యం నానిపోవడంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. గురువారం వర్షాలకు తెరిపిచ్చి ఎండపెట్టడంతో రైతులు ధాన్యం, తడిసిన పనలు ఎండబెట్టారు. అయితే ధాన్యానికి మొలకలు రావడంతో ఆందోళన చెందుతున్నారు. కాగా తడిసిన ధాన్యం ఆరబెట్టుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ మధుబాబు సూచించారు.ఈ మేరకు పెద్దజగన్నాథపురం, కొసమాలలో వరికుప్పలను పరిశీలించారు.

- హరిపురం, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని వీజీపురం, మదనాపురం, కొత్తపల్లి, శ్రీనివాసపురంల్లో వ్యవసాయ శాఖ ఏడీ ఎల్.మధు సిబ్బందితో నీటి మునిగిన పంటపొలాలు, తడిసిన ధాన్యం రాశులు పరిశీలించారు. ధాన్యం ఎలా రక్షించుకోవాలో సూచనలు చేశారు.

- హిరమండలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబావల్లి, కిట్టాలపాడు, రెల్లివలస, పిండ్రువాడల్లో నీట మునిగిన మొక్కజొన్న, పెసర, మినుము పంటలను ఏవో సంధ్య పరిశీలించారు. వర్షాలకు పొలాల్లో నీరు చేరడంతో తెగుళ్ల ఆశించే అవకాశం ఉండడంతో ని రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.


జలుమూరు: తడిసిపోయిన ధాన్యాన్ని రోడ్డు పక్కన టార్పాలిన్లపై ఆరబోసిన రైతులు

- జలుమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జలుమూరు, పెద్దదూగాం తదితర గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. మొలకలు వచ్చిన ధాన్యాన్ని చూసి లబోదిబోమంటున్నారు. పొలాల్లోనీరు ఉండడంతో కుప్పల్లో ధాన్యం పాడయ్యే అవకాశముందని రైతులు చెబుతున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

ఆమదాలవలస, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రానికి సమీపాన కొత్తరోడ్డు వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొని కూన భరత్‌కుమార్ (38) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందినట్టు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. ఎచ్చెర్ల మండలం వెంకటాపురానికి చెందిన భరత్‌కుమార్ హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. భరత్‌కుమార్ గార మండలం ఆడవరం గ్రామంలో ఉన్న అత్తవారింటికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి.. బుధవారం రాత్రి స్వగ్రామానికి వస్తుండగా.. కొత్తరోడ్డు జంక్షన్ వద్ద ఎదురుగా ఒడిశాకు చెందిన ఓ కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో భరత్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా భరత్‌కుమార్‌కి భార్య గాయత్రితోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెంకటేష్ తెలిపారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తన భర్త కిల్లాన చైతన్య ఈనెల 21న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆయన భార్య కృష్ణవేణి గురువారం ఫిర్యాదు చేసినట్టు టూటౌన్ సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు. గుజరాతీపేటలోని మురపాల వీధిలో నివసిస్తున్న చైతన్య వరుణ్ మోటార్స్‌లో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక పరిస్థితులు బాగోలేక మద్యానికి బానిసయ్యాడని, ఈక్రమంలో ఈనెల 21వ తేదీ రాత్రి 9గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

కొబ్బరి మొక్కలు ధ్వంసం చేశారని..

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదవంక గ్రామానికి చెందిన బత్తిని లక్ష్మీనారాయణ కొబ్బరి తోటలో గుర్తు తెలియని వ్యక్తులు మొక్కలపై విషప్రయోగం చేసి ధ్వంసంచేశారని బాధితుడి ఫిర్యాదుచేసినట్లు ఎస్ఐ బి.నిహార్ తెలిపారు. ద్రావకం చల్లారని ఫిర్యాదుమేరకు దర్యాప్తుచేస్తామని చెప్పారు.

మద్యం మత్తులో వీరంగం

ఆమదాలవలస, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం ఉదయం రైల్వేస్టేషన్ ఆవరణలో ఓ వ్యక్తి మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. స్థానికుల కథనం మేరకు..పట్టణంలోని ఓ ప్రైవేట్ ఐటీఐలో రాత్రి కాపలాదారుగా పనిచేస్తున్న ఓ వ్యక్తిని పిలిచి.. నిన్ను మాల ఎవరు ధరించమన్నారని చెంపలపై కొట్టి ఇంకోసారి మాలవేస్తే నీ అంతు చూస్తానని బెదించాడు. దీంతో అక్కడే ఉన్న రైల్వే ప్రయాణికులు భయంతో పరుగులు తీశారు. కాసేపటి తర్వాత రైల్వేస్టేషన్ పక్కన ప్రధాన రహదారిపై ఉన్న మున్సిపల్ భవన దుకాణాల సముదాయం వద్ద ఉన్న ఫలహార దుకాణం వద్దకు వెళ్లి అక్కడ పని చేస్తున్న ఓ కార్మికుడితో గొడవపడి, అతడి చొక్కాచింపివేసి అసభ్య పదజాలంతో దూషించడంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ప్రతిరోజూ మద్యంమత్తులో కొంతమంది నానా దుర్భాషలాడుతూ ఎదురించడం పరిపాటిగా మారిందని దుకాణదారులు వాపోతున్నారు. రైల్వేస్టేషన్ పరిధిలోని మద్యం విక్రయాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డివైడర్ ఎక్కిన వాహనం

టెక్కలి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి):టెక్కలి జగతిమెట్ట వద్ద నౌపడా డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడు మళ్ల బాలకృష్ణకు చెందిన వాహనం నడుపుతున్న డ్రైవర్ మొర్రి రామకృష్ణ గురువారం అస్వస్థతకు గురయ్యాడు. ఆయనకు ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో అపస్మారక స్థితికి చేరడంతో వాహనం డివైడర్ ఎక్కింది. దీంతో వాహనం అదుపుతప్పడంతో ఎదురుగా వస్తున్న టెక్కలి ఎన్టీఆర్ కాలనీకి చెందిన సైకిలిస్ట్ హనుమంతు సింహాచలం, ద్విచక్ర వాహనం నడుపుతున్న కుమ్మరి గోపాల్‌ను ఢీకొట్టింది. సింహాచలం తీవ్రంగా గాయపడడంతో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా వైద్యులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

డ్రోన్ టెక్నాలజీతో నిఘా

టెక్కలి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): టెక్కలి ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలపై దృష్టిసారించేందుకు డ్రోన్ టెక్నాలజీతో నిఘాను ఏర్పాటు చేసినట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. మద్యం, గంజాయి అక్రమరవాణాపై దృష్టి సారిస్తామని చెప్పారు.గురువారం నౌపడా-మెళియాపుట్టి రోడ్డులో దమర, గూడేం ప్రాంతాలు, జాతీయరహదారి ఎఫ్‌సీఐగొడౌన్, అలాగే జగతిమెట్ట, ఆదిత్యఇంజనీరింగ్ కళాశాల వెనుక ప్రాంతంతో పాటు ఎర్రన్నాయుడు పార్కు, ఆదీఆంధ్రావీధి, చిన్నచేరివీధి జంక్షన్, ఆర్టీసీ గ్యారేజ్ వెనుక ప్రాంతం, ఇందిరాగాంధీ జంక్షన్, పాత గవర్నమెంట్ ఆసుపత్రి, రామకృష్ణ మఠం, ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక ప్రాంతాల్లో డ్రోన్‌కెమేరాతో పరిశీలించారు.

కేంద్రాసుపత్రిలో బిడ్డ మృతిపై విచారణ


బాధితురాలు, కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి,డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రిలో బిడ్డ మృతిపై గురువారం ఆర్డీవో కృష్ణమూర్తి ప్రాథమికంగా విచారణ నిర్వహించారు. జిల్లా కేంద్రాసుపత్రి ప్రసూతి విభాగంలో బుధవారం నందిగాం మండలంలోని కైజోల గ్రామానికి చెందిన పడ్డ శ్రావణి మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే డెలివరీ సమయంలో బిడ్డ మెడకు పేగులు చుట్టుకోవడంతో ఆ బిడ్డ మృతిచెందింది. దీంతో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే బిడ్డ మృతిచెందిందని కుటుంబసభ్యులు ఆరోపించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విచారణకు ఆదేశించారు. దీంతో గురువారం జిల్లా కేంద్రాసుపత్రిలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, తహసీల్దార్ సాధు దిలీప్‌చక్రవర్తి వైద్యురాలు ధనలక్ష్మి, శ్రవంతి, చిన్నపిల్లల వైద్యులు రామ్మోహనరావు, సీనియర్ వైద్యులు లక్ష్మణరావు, హెడ్‌నర్స్ నీలవేణి తదితరులను విచారించారు. తర్వాత పూర్తిసాయి విచారణకోసం డిప్యూటీ డీఎంహెచ్‌వో, సీనియర్ గైనకాలజీ వైద్య నిపుణులు, సీనియర్ చిన్నపిల్లల వైద్య నిపుణులతో త్రీమెన్ కమిటీకి సిఫారసు చేశారు. దీంతో శ్రీకాకుళానికి చెందిన గైనకాలజీస్టు జయశ్రీ, చిన్నపిల్లల వైద్య నిపుణులు సుధారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు విచారణ నిర్వహించి 24గంటల్లో నివేదిక అందజేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాగా ఆర్డీవో కృష్ణమూర్తి ఆసుపత్రిలో గురువారం వైద్యులు,సిబ్బందితో ప్రాథమిక విచారణచేసి అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బిడ్డ తల్లిశ్రావణి, అత్త కృష్ణవేణి, భర్త శంకరరావులతో మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే బిడ్డ మృతి చెందిందని ఆర్డీవో వద్ద విలపించారు.కాగా విచారణకోసం కలెక్టర్ నియమించిన వైద్య నిపుణులు జయశ్రీ, సుధారాణి గురువారం రాత్రి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవోను కలుసుకున్నారు.

పార్టీల విలీన సభను విజయవంతం చేయండి

పలాస రూరల్, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి):హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ కోరారు. గురువారం బొడ్డపాడు అమర వీరుల స్మారక మందిరంలో రెండువిప్లవ పార్టీల విలీనసభ, గోడపత్రికలు, కరపత్రాల ఆవిష్కరించారు. కార్యక్రమానికి సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి దర్శనసింగ్ ఖట్కకర్ హాజరవుతారని తెలిపారు. కార్పొరేట్ విధానాలను అవలంబిస్తూ దేశ సంపదను దోచుకుం టున్న పార్టీల మదం అణచడానికి రెండుపార్టీలు విలీనమవుతు న్నాయని తెలిపారు.

శ్రీముఖలింగేశ్వరునికి గ్రామోత్సవం

జలుమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం గురువారం రాత్రి నిర్వహించారు. మార్గశిరమాసం బహుళ ఏకాదశి పురస్కరించుకొని అర్చకులు స్వామి వారికి ఉదయం ప్రత్యేక పూజలు చేసి స్వామి దర్శనం భక్తులకు కల్పించారు. సాయంత్రం గర్భగుడిలో గల పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు అలంకరించి పల్లకిలో ఆశీనులను చేశారు. అనంతరం వేదమంత్రాల నడుమ పార్వతీ పరమేశ్వరుల గ్రామోత్సవం నిర్వహించారు. కార్య క్రమంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, సింహాచలం, వెంకటాచలం పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం

- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష


మహిళా సంఘాలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. గురువారం పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కార్యాలయంలో 80 మహిళా సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ చెక్కుల పంపిణీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళాభ్యుదయానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతోగానో కృషి చేస్తున్నారని తెలిపారు. తొలుత మునిసిపల్ పారిశుధ్యకార్మికులకు ఏకరూపదుస్తులు, సామగ్రిఅందజేశారు.కమిషనర్ ఎన్.రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, రాష్ట్ర ట్రేడ్‌ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, కౌన్సిలర్లు దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ,టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, దడియాల నర్సింహులు పాల్గొన్నారు.

దశలవారీగా ఎన్నికల హామీల పరిష్కారం

- నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


నరసన్నపేట: క్రీడాకారుని అభినందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఓటరుప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి తెలిపారు. గురువారం దీర్ఘాశి, చీడివలస, సన్యాసిరాజుపేట, తోటాడ, ఇలపండపేట, జొన్నయ్యపేట, గవరమ్మపేట, గ్రామాల్లో మంజూరుచేసిన రహదారిపనులకు శంకుస్థాపన చేశారు. కార్య క్రమంలో నాయకులు డోలజగన్, ముద్దాడబైరాగినాయుడు, ఎంపీ నాయుడు, రోణంకికృష్ణంనాయుడు, సూరపునారాయణదాస్, ధర్మాన తేజ పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో రాణించాలి

నరసన్నపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బాడీ బిల్డింగ్ పోటీల్లో రాణించేందుకు నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. జాతీయ స్థాయిలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో బంగారు పతకం సాధించిన పోగోటి సతీష్‌కుమార్ ఎమ్మెల్యేను గురువారం తన క్యాంపు కార్యాలయంలో కలిశారు.ఈసందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ పోటీల్లో రాణించి దేశకీర్తిప్రతిష్ఠలను పెంచేందుకు నిరంతరం సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకట్రావు, విశ్రాంతి ఉపాధ్యాయులు పోగోటి అప్పలనాయుడు, చెట్టు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించే వరకూ నిరసనలు

కాశీబుగ్గ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ చార్జీలు తగ్గించే వరకూ మేధావులు, కార్మికులు, రైతులు, వ్యాపారులు, విద్యార్థులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చాపర వేణుగోపాల్ పిలుపునిచ్చారు. గురువారం కాశీబుగ్గలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఆ పార్టీ నాయకులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ చేసిన పోరాటాలను వివరించారు. కార్యక్రమంలో సుందరావు రవి, ముకుందరావు, మున్నా, స్వామి, చిన్న, గుణశేఖర్, తిరుపతి పాల్గొన్నారు.

పాతపట్నం సబ్‌జైలు పరిశీలన

పాతపట్నం, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి):పాతపట్నం సబ్‌జైలును కోస్తాంధ్ర ప్రాంతం జైళ్ల ఉపశాఖ అధికారి ఎంఆర్‌రవికిరణ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ జైలులో ఖైదీల ఆరోగ్యస్థితిగతులు, భోజన నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది క్వార్టర్లలో రంగులు వేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట జిల్లా సబ్ జైళ్ల అధికారి కె.మోహనరావు, సబ్‌జైల్ సూపరింటెండెంట్ జి.రాముఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న రవికిరణ్

ప్రతి ఇంటికి తాగు నీరందిస్తాం

పలాస, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఇంటికి తాగు నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జాతీయ జలజీవన్‌మిషన్ బృందం స్పష్టం చేసింది. ఈ మేరకు రామ కృష్ణాపురం రెవెన్యూ పరిధిలో గల కోసంగిపురం రోడ్డులో నిర్మిస్తున్న ప్రభుత్వ గృహ సముదాయంలో ఏర్పాటుచేసిన కొళాయిలను గురువారం బృందం పరిశీలించింది.ఈ సందర్భంగా బృంద సభ్యులు సౌమిత్రాసేన్ గుప్తా, సౌమింద్రారంజన్ గంగూలి, సమీర్‌పండా, ఆర్ డబ్ల్యూఎస్ డీఈఈ సూర్యనారాయణ విలేకరులతో మాట్లాడారు. కాలనీలో రూ.3.16 కోట్ల వ్యయంతో మంచినీటి పథకాలు నిర్మిస్తున్నామని, ప్రతి ఇంటికి నీరు అందించే కార్యక్రమం చేపడు తున్నామని తెలిపారు. రామకృష్ణాపురంలో రూ.30 లక్షలతో చేపట్టిన మంచినీటి పథకా న్నిబృందం పరిశీలించింది.వీరి వెంట ఏఈలు ధనుంజయ్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.


కొళాయిని పరిశీలిస్తున్న జేజేఎం బృందం సభ్యులు

లక్ష్య సాధనతో విద్యనభ్యసించాలి

మందస, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): లక్ష్యసాధనతో విద్యనభ్యసిస్తే విజయం తప్పక సాధించవచ్చని మోటివేషన్ స్పీకర్ ఎం.సీత తెలిపారు. గురువారం మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు అధ్యక్షతన ప్రేరణా తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగభూషణం, ఎల్.సోమేశ్వరరావు, పి.గోవిందరావు, బి.ప్రవీణ్, డి.శాంతి, కె.రవి, నరేష్, కె.జానకిరావు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా క్యాలెండర్ల ఆవిష్కరణ


షిర్డీ సాయిబాబా క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి మంజుల

పలాస, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): షిర్డీ సాయిబాబా సంస్థాన్ ట్రస్టు ద్వారా ఏటా సేవా, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఫౌండర్, చైర్మన్ దువ్వాడ శ్రీధర్(బాబా) తెలిపారు.గురువారం జంటపట్టణాల్లోగల ట్రస్టు మందిరంలో 2025 సంవత్సర క్యాలెండర్‌ను వైద్యాధికారి మంజుల ఆవిష్కరించారు. ఈసందర్భంగా శ్రీధర్ మాట్లాడుతు ప్రతి భక్తుని ఇంట బాబా క్యాలెండర్ ఉండాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, నిరంతరం అన్నదానం, ప్రత్యేకపర్వదినాల్లో సామూహిక అన్నప్రసాదవితరణ, పేదలకు దుస్తులు, గ్రామాల్లో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బాబా కమిటీ సభ్యులు మల్లా కామేశ్వరరావు, తాళాసు ప్రదీప్ కుమార్, బెల్లాల నారాయణరావు, డబ్బీరు భువనేశ్వర్, బోనెల రమణారావు, కూన హేమాచలం, కిల్లి ఆనంద్, సాహుకారి నాగేశ్వరరావు, బరాటం సత్యం, డాక్టర్ కృష్ణారావు, ఎడి కుమార్, టి.శ్రీనివాస్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు టెక్కలి విద్యార్థుల ఎంపిక

టెక్కలి, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి):టెక్కలి డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు శుక్రవారం నుంచి ఈనెల 30 వరకు భువనేశ్వర్‌లో జరిగే ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొనేందుకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ తెలిపారు.ద్వితీయ సంవత్సరం బీఎస్సీ విద్యార్థి దారపు డిల్లీ లాంగ్ జంప్‌లో, మూడోసంవత్సరం బీఏ విద్యార్థి టొంపలయోగేశ్వరరావు వంద మీటర్ల పరుగు పందానికి, కొర్రాయి ధనుంజయ 400 మీటర్ల పరుగు పందానికి ఎంపికయ్యారని చెప్పారు. ఈ మేరకు వీరిని ప్రిన్సిపాల్ గోవిందమ్మతో పాటు వైస్‌ప్రిన్సిపాల్ సతీష్, ఐక్యూ కోఆర్డినేటర్ లూకాపాల్, పీడీలు కోటేశ్వరరావు, సత్యనారాయణ అభినందించారు.

వ్యాసరచన పోటీల్లో సత్తాచాటిన కరజాడ విద్యార్థులు

మెళియాపుట్టి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కరజాడ జడ్పీ పాఠశాల విద్యార్థులు చాపర శ్రీజ.ఎం.యువరాజ్, జి.కీర్తన జాతీయ వినియోగదారులు దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో సత్తాచాటినట్లు హెచ్ఎం వెంకట్రావ్ తెలిపారు. ఈ మేరకు వారికి జేసీ అభినందించారు.

ఎర్ర చెరువులో సర్వే

పాతపట్నం డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని ఎర్రచెరువులో రెవెన్యూ అధికారులు గురువారం సర్వే నిర్వహించారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఉన్నతాధికారులకు ఎర్రచెరువు ఆక్రమణల తొలగింపుపై ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఆర్డీవో ఆదేశించారు.ఈమేరకు తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో మండల సర్వేయర్ రామ్‌గణపతి సర్వేను నిర్వహించారు.

మిల్లర్ల మాయాజాలంతో రైతులకు నష్టం

హరిపురం, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం తూకంలో మిల్లర్ల మాయాజాలంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చైతన్య రైతు సంఘం నాయకుడు కొర్ల హేమారావుచౌదరి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, ఏపీ రైతుసంఘం కార్యదర్శి కె.మోహనరావు ఆరోపించారు.గురువారం మందస మండలంలోని రాధాకృష్ణాపురం- సారంగపురం కూడలిలో సీఐటీయూ కార్యదర్శి కె.కేశవరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతుల వద్ద తేమ పేరుతో అధికంగా తూకం వేసి దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. దీనికి నిరసనగా జనవరి రెండో తేదీన మందస తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గుసిరి వెంకటరావు, చింతాడ గణపతి, శ్రీను, సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, ఎం.ధర్మారావు, బెస్త కామేశ్వరరావు, సవర పాల్గుణరావు, మురిపాల నారాయణరావు, కె.రఘురామయ్య పాల్గొన్నారు.

కుల గణన సర్వే డేటా ప్రచురణ

జలుమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కుల గణనపై అభ్యంతరాలు ఉంటే ఈ నెలాఖరులోగా తెలియజేయాలని తహసీల్దార్ జన్ని రామారావు తెలిపారు. గురువారం మండలంలోని నగిరికటకం గ్రామ సచివాలయంలో ఎస్సీ కుల గణన సర్వే డేటాను ప్రచురించారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్, వీఆర్వో డి.గోపి, మండల సర్వేయర్ తర్ర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పనిచేయాలి

మెళియాపుట్టి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పనిచేయాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. కాకినాడలో జనవరి ఐదు నుంచి ఎనిమిదో తేదీ వరకూ జరిగే యూటీఎఫ్ సర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని గురువారం మెళియాపుట్టిలో ప్రచార యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరావు, కార్యదర్శి కిషోర్, ఆర్.మోహన్‌రావు, శ్రీలక్ష్మి ,బాబురావు, రామ్మూర్తి, చలం, రమణ పాల్గొన్నారు.

- పాతపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జనవరి ఐదు నుంచి ఎనిమిదో తేదీ వరకూ జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. పాతపట్నంలో యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించడంతోపాటు జాతా నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్‌రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్, జిల్లా అధ్యక్షకార్యదర్శులు బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి, మండలఅధ్యక్ష కార్యదర్శులు మోహనరావు, గొంటి గిరిధర్ పాల్గొన్నారు.


మెళియాపుట్టి: ప్రచారయాత్ర నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

11న జానపద కళాజాతర

పలాస రూరల్, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగోయిలో గిడుగు రామమూర్తి తెలుగుభాష జానపద కళాపీఠం ఆధ్వర్యంలో 21వవార్షికోత్సవ సంక్రాంతి జానపద కళాజాతర జనవరి 11న నిర్వహించనున్నట్లు కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉద్దానం సన్నాయి తుడుం మేళం, గంగిరెద్దులు, జముకుల, ఎరుకుల , దేవుడు పాటలు, బుడిగ జంగాలు, కోలాటం, బుర్రకథ, స్త్రీల జానపద గీతాలు తదితర ప్రాచీన జానపద కళారూపాలుకళాకారులు ఆలపిస్తారని పేర్కొన్నారు. జానపద పాటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు అసిస్టెంట్ కుక్ పోస్టులకు ఇంటర్వ్యూలు

నందిగాం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనాపురం కేజీబీవీలో ఇద్దరి అసిస్టెంట్ కుక్‌ల నియామకానికి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు నందిగాం ఎంఈవో-2 ఎ.చిన్నారావు ఒక ప్రకటనలో తెలిపారు. నందిగాం అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఉదయం పది గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు దరఖాస్తు చేసుకున్న వారంతా ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

59 డీలర్ పోస్టుల నియామకానికి నోటిఫికేషన్

టెక్కలి,డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): టెక్కలి రెవెన్యూ పరిధిలో గల తొమ్మిది మండలాల్లో 59చౌకధరల దుకాణాల డీలర్ల నియామకాలకు గురువారం నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. గురువారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ రేషన్‌కార్డుల సంఖ్య పెరగ డంతో బైఫరికేషన్ చేయడంవల్ల 13ఖాళీలు, కొంతమంది మరణించడం, మరికొందరు రాజీనామా చేయడం, డీలర్లుగా వ్యవహరిస్తూ పెళ్లైన తర్వాత ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో నోటిఫికేషన్ జారీచేసినట్లు చెప్పారు.ఈ మేరకు జనవరి తొమ్మిదో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా సబ్ కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల స్క్రూట్నీ జనవరి 10న,17న హాల్ టిక్కెట్ల జారీ, 19న ఉదయం 11గంటలకు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించనున్నారని చెప్పారు. రాత పరీక్ష 80 మార్కులకు, ఇంటర్వ్యూ 20 మార్కులకు ఉంటుందని, 1:5 శాతం ఇంటర్వ్యూకు పిలవనున్నారని తెలిపారు. పరీక్ష ఫలితాలు జనవరి 23న వెలువడతాయని, ఇంటర్వ్యూలు సబ్ కలెక్టరేట్‌లో జనవరి 27న నిర్వహించి, డీలర్‌షిప్‌కు ఎంపికైన వారి తుది జాబితా 30న వెల్లడిస్తారని చెప్పారు.

హెల్మెట్ తప్పనిసరి

సంతబొమ్మాళి, డిసెంబరు 26(ఆంధ్ర జ్యోతి): ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సంతబొమ్మాళి ఎస్ఐ సింహాచలం తెలిపారు. గురువారం సంతబొమ్మాళిపాలేశ్వరిస్వామి ఆలయ జంక్షన్‌లో వాహనాలు తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్మెట్‌ధరించకపోతే అపరాధ రుసుమువిధించనున్నట్లు హెచ్చరించారు.

పశువులకు గొంతువాపు టీకాలు

కోటబొమ్మాళి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కురుడులో గురువారం 78 పశువులకు బుధవారం గొంతువాపు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా పశువైద్య సహాయ సంచాలకులు ఎం. లోకనాధం, పశు వైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాకు 10 వేల గొంతువాపు టీకాలు వచ్చాయని చెప్పారుటెక్కలి డివిజన్‌కు 4800 పంపించారని, ఇందులో కోటబొమ్మాళి మండలానికి 600 డోసులు వచ్చాయని ఇప్పటి వరకు 267 పశువులకుటీకాలు వేశామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ముకుందరావు, నారాయణరావు పాల్గొన్నారు.

పాతపట్నంలో 'వీరబాల దివస్'

పాతపట్నం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే పిల్లలో ధైర్య లక్షణాలు నింపి చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ పీవో టి.విమలారాణి పిలుపునిచ్చారు.గురువారం పాతపట్నంలోని శివంకర్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రం-2లో వీరబాల దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల్లో ధైర్యోచిత, నాయకత్వ లక్షణాల పెంపొందించేందుకూ కేంద్ర ప్రభుత్వం ఈకార్యక్రమం రూపొందించిందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.అరుణ, అంగనవాడీ కార్యకర్త శ్రీదేవి పాల్గొన్నారు.